# హామీలపై ప్రభుత్వాన్ని నిలదీయాలి



- అమలు కాని ఆరు గ్యారంటీలే కాంగ్రెస్ సర్కార్ పతనానికి నాంది
- గ్రామసభల్లో ప్రజలు తిరగబడుతున్నారు
- బీఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

ఆర్మూర్‌టౌన్, జనవరి 23: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలపై గ్రామసభల సాక్షిగా కాంగ్రెస్ సర్కారును నిలదీయాలని ప్రజలకు బీఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. అమలు కాని ఆరు గ్యారంటీలే కాంగ్రెస్ ప్రభుత్వ పతనానికి నాంది అని పేర్కొన్నారు. గ్రామసభల్లో ప్రజలు తిరగబడుతున్నారని తెలిపారు. ఏడాది దాటినా ఆరు గ్యారంటీలకే గతి లేదని, ఇక ఇండ్లు, రేషన్ కార్డు ఇస్తామంటే నమ్మేదెవరని ప్రశ్నించారు. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డుల మంజూరు పేరుతో నిర్వహిస్తున్న గ్రామసభల్లో ప్రజల తిరుగుబాటు కాంగ్రెస్ ప్రజా వ్యతిరేక పాలనకు నిలువెత్తు నిదర్శనమని పేర్కొన్నారు.ఆరు గ్యారంటీలకే ఉప్పు పాతరేసి కొత్తగా ఈ డ్రామాలేమిటని ప్రజలు నిలదీస్తున్నారని తెలిపారు. అక్కడక్కడ హామీల అమలుపై ఎమ్మెల్యేలను ప్రజలు నిలబెట్టి అడుగుతున్నారన్నారు. ఇండ్లు ఎప్పుడు కట్టిస్తామంటూ ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డిపై మహిళలు తిరగబడ్డారని గుర్తుచేశారు. భువనగిరి ఎమ్మెల్యేను ఉరికిచ్చి కొట్టారన్నారు. ఇందిరమ్మ ఇండ్లు,రేషన్ కార్డుల సర్కస్ ఫీట్లు, లోకల్ బాడీ ఓట్ల కోసం కాంగ్రెస్ పడుతున్న పాట్లు అని ఎద్దేవా చేశారు. ఇది పీపుల్స్ సర్కార్ కాదని, గ్రాఫిక్ సర్కార్ అని విమర్శించారు. అబద్ధాలు చెబుతూ వైకుంఠం చూపిస్తున్నారన్నారు. స్థానిక ఎన్నికల్లో హీరో కావాలని మోసాలకు పాల్పడుతున్న కాంగ్రెస్ జీరో కాక తప్పదన్నారు. గ్రామసభల సమయంలో సీఎం రేవంత్ రెడ్డి దేశంలోనే లేరని, మంత్రులు పత్తా లేకుండా పోయారని, ఎమ్మెల్యేలను గ్రామాలకు రానివ్వడం లేదన్నారు. హామీలు అమలు చేయకుండా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ప్రజల్లో తిరగలేరన్నారు.

## అధికారులను నిలదీసిన కాంగ్రెస్ నాయకుడు

- ఇందిరమ్మ ఇండ్లకు అనర్హుల ఎంపికపై ఆగ్రహం

రెంజల్, జనవరి 23 : మండలంలోని నీలా గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో అధికారులపై కాంగ్రెస్ నాయకుడు, ఇందిరమ్మ కమిటీ సభ్యుడు షేక్ మునీర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులపై చేపట్టిన సర్వేలో అనర్హులను ఇందిరమ్మ ఇండ్లకు ఎలా ఎంపిక చేశారంటూ నిలదీశారు. లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపట్టలేదని తహసీల్దార్ శ్రావణ్‌కుమార్‌తో వాగ్వాదానికి దిగారు. దీంతో సభలో గందరగోళం ఏర్పడింది. ఒక్కసారిగా గ్రామస్తులు ఎగబడడంతో అధికారులు గ్రామసభ ముగించుకొని వెళ్లిపోయారు.



నీలా గ్రామసభలో కార్యదర్శిని ప్రశ్నిస్తున్న కాంగ్రెస్ నాయకుడు షేక్ మునీర్



డిచ్‌పల్లి మండలం ఘన్‌పూర్ గ్రామసభలో మండల ప్రత్యేకాధికారి యోహాన్‌ను నిలదీస్తున్న గ్రామస్తులు

### ఆత్మహత్య చేసుకుంటా..

బాల్కొండ గ్రామసభలో మహ్మద్ ఇఫ్తార్ అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశాడు. పథకాల కోసం దరఖాస్తు చేసుకుంటే ఒక్కటి కూడా మంజూరు కాలేదని, అన్ని అనర్హులకే మంజూరు చేశారంటూ ఆవేదన వ్యక్తంచేశాడు. సమస్యలను చెప్పుకోవడానికి మైక్ ఇవ్వాలని, లేకుంటే ఆత్మహత్య చేసుకుంటానని చెప్పడంతో పోలీసులు అతడిని సముదాయించారు.



మహ్మద్ ఇఫ్తార్‌ను సముదాయిస్తున్న పోలీసులు



రామారెడ్డి మండలం రెడ్డిపేట్‌లో అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు

# మూడోరోజూ నిలదీతల పర్వం

- రచ్చరచ్చగా గ్రామసభలు
- తప్పుల తడకగా అర్హుల జాబితాలు
- అధికారులపై గ్రామస్తుల ఆగ్రహావేశాలు
- అర్హులకు అన్యాయం చేశారంటూ నిరసనలు
- సభా వేదికలపై దూసుకొచ్చిన దరఖాస్తుదారులు
- జనం ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేక నీళ్లు నమిలిన ఆఫీసర్లు
- పలు గ్రామాల్లో అర్ధాంతరంగా ముగిసిన సభలు

## కామారెడ్డి జిల్లాలో

**ఎల్లారెడ్డి మండలం** భిక్నూర్‌లో నిర్వహించిన గ్రామసభ రసాభాసగా మారింది. అర్హులకు కాకుండా కాంగ్రెస్ పార్టీ అనుయాయుల పేర్లను చదవడంతో గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. దీంతో ఆర్డీవో మన్నె ప్రభాకర్ కల్పించుకొని సముదాయించడంతో గొడవ సద్దుమణిగింది.

లింగంపేట గ్రామసభలో రేషన్ కార్డులపై గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. లింగంపేట మేజర్ పంచాయతీకి కేవలం 79 రేషన్ కార్డులు మంజూరుచేయడంపై నిరసన వ్యక్తంచేశారు. గతంలోనే దరఖాస్తు చేసుకున్నా తమకు ఎందుకు రాలేదని మహిళలు అధికారులను నిలదీశారు. ఇందిరమ్మ ఇండ్లు కూడా అర్హులకు రాలేదన్నారు. కూలి పనులు చేసుకుంటూ జీవించే తాము పనులు వదులుకొని దరఖాస్తు చేసుకుంటూ కార్యాలయాల చుట్టూ తిరగాలా అని ప్రశ్నించారు. గ్రామస్తులకు సమాధానాలు చెప్పేవారే కరువయ్యారు. ఎల్లారెడ్డి ఏడీఏ ప్రయత్నించగా, గ్రామస్తులు అధికారులను చుట్టుముట్టడంతో ఏడీఏ మాట్లాడకుండానే సభ నుంచి వెళ్లిపోయారు. గంటకు పైగా గందరగోళ వాతావరణం ఏర్పడడంతో అధికారులు గ్రామసభను అర్ధాంతరంగా ముగించి వెళ్లిపోయారు. అర్హులకు మద్దతుగా మాజీ ఎంపీపీ ముదాం సాయిలు అధికారులను ప్రశ్నించగా కాంగ్రెస్ పార్టీ నాయకులు జోక్యం చేసుకున్నారు.



ఇల్లు మంజూరు కాకపోవడంతో లింగంపేట గ్రామసభలో రోదిస్తున్న మహిళ

దీంతో ఇరువర్గాల మధ్య మాటల యుద్ధం సాగింది. మండల కేంద్రానికి చెందిన ఒడ్డె సావిత్రికి ఇందిరమ్మ గృహం మంజూరు కాలేదని గ్రామసభలో రోదించింది.

బీబీపేట మండలంఇస్సానగర్, మాందాపూర్, యాడారం గ్రామ సభల్లో అర్హులైన వారి పేర్లు జాబితాలో రాకపోవడంతో గ్రామస్తులు అధికారులను నిలదీశారు. బాన్సువాడ మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన గ్రామసభల్లో రేషన్ కార్డుల లబ్ధిదారుల జాబితాలో తమ పేర్లు రాలేవంటూ గ్రామస్తులు ఆందోళన వ్యక్తంచేశారు.



సదాశివనగర్ మండలం ఉత్తునూర్ గ్రామసభలో హామీలపై ఎంపీడీవోను ప్రశ్నిస్తున్న గ్రామస్తులు

సదాశివనగర్ మండలం ఉత్తూనూర్‌లో నిర్వహించిన గ్రామసభలో అధికారులను నిలదీశారు. ఇందిరమ్మ ఇండ్లు, రైతుభరోసా, తలం బంగారం, రుణమాఫీపై ప్రశ్నల వర్షం కురిపించారు. ఇంకా ఎన్నిసార్లు దరఖాస్తులు తీసుకుంటారని మండిపడ్డారు. రామారెడ్డి మండలం రెడ్డిపేట్ గ్రామంలోనూ హామీ అమలుపై అధికారులను గ్రామస్తులు నిలదీశారు. నస్రుల్లాబాద్,బీర్కూర్ మండలాల్లోని గ్రామాల్లో నిర్వహించిన గ్రామ సభలు వాడివేడిగా కొనసాగాయి. నస్రుల్లాబాద్ మండలం అంకోల్ తండా సభలో ఇందిరమ్మ ఇండ్లపై అధికారులను నిలదీశారు. దోమకొండ మండలంలోని సంగమేశ్వర్, అంబారీపేట, ముత్యంపేట గ్రామాల్లో లబ్ధిదారుల ఎంపిక జాబితాల్లో పేర్లు రాకపోవడంతో అధికారులను గ్రామస్తులు నిలదీశారు.

### నీళ్లు నమిలిన అధికారులు

బిచ్కుందలో నిర్వహించిన గ్రామసభలో రేషన్‌కార్డులపై అధికారులను నిలదీశారు. దీంతో సభలో గందరగోళ పరిస్థితి ఏర్పడింది. ప్రజా పాలనలో 2600 మంది రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకుంటే 240 మంది పేర్లు జాబితాలో ఎలా వస్తాయని గ్రామస్తులు ప్రశ్నించడంతో అధికారులు సమాధానాలు చెప్పలేక నీళ్లు నమిలారు. అర్హులకు అన్యాయం చేశారని, ఎన్నిదరఖాస్తు చేసుకోవాలంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. మరోసారి దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించడంతో గతంలో ఇచ్చిన వాటి గురించి చెప్పాలంటూ పట్టుబట్టారు. ఈ క్రమంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతల మధ్య తోపులాట జరుగగా, ఎస్సై మోహన్ రెడ్డి సముదాయించారు.దీంతో గ్రామస్తులు ఇది గ్రామ సభనా..రాజకీయ నాయకుల సమావేశమా అంటూ మండిపడ్డారు.



బిచ్కుంద మండల కేంద్రంలో గందరగోళంగా మారిన గ్రామసభ

## నిజామాబాద్ జిల్లాలో..

**డిచ్‌పల్లి మండలం** ఘన్‌పూర్ గ్రామసభలో యుద్ధవాతావరణం నెలకొన్నది. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల జాబితాలో తమ పేర్లు రాలేవంటూ అధికారులపై మహిళలు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇంటింటికీ వచ్చి అధికారులు తమ ఖాళీ ప్లాట్ల వద్ద ఫొటోలు తీసుకుని వెళ్లారని, ఇప్పుడు ఎంపిక జాబితాలో తమ పేర్లు ఎందుకు రాలేదని మహిళలు ప్రశ్నించారు. ఇప్పటికే ఇండ్లు ఉన్న వారి పేర్లే మళ్లీ ఎంపిక జాబితాలో ఉండడంపై పేర్లు రాని పేదలు అసహనం వ్యక్తం చేశారు. ఒకదశలో గ్రామసభ వేదికపై కి దూసుకువచ్చి అధికారులతో వాగ్వాదానికి దిగారు.దీంతో సభలో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. డిచ్‌పల్లి సీఐ మల్లేశ్, ఎస్సై సత్యం, ఏఎస్సై హమీద్ మహిళలను సముదాయించేందుకు యత్నించారు. తమ సమస్యలను అధికారులకు చెప్పుకుంటుంటే పోలీసులు అడ్డుకోవడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. నవీపేట మండలంలోని పలు గ్రామాల్లో పథకాల జాబితాలోఅర్హుల పేర్లు గల్లంతవడంపై గ్రామస్తులు అధికారుల పై తీవ్ర స్థాయిలో మండి పడుతూ అడుగుగడునా నిలదీశారు. గుంట భూమిలేని ఉపాధిహామీ కూలీలకు ఇవ్వకుండా భూములు ఉన్న వారికే ఆత్మీయ భరోసా పథకంలో పేర్లు వచ్చాయని ఎంపీడీవో నాగనాథ్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిలదీశారు. సొంతంగా ఇండు ఉన్నవారికి ఇందిరమ్మ ఇండ్లు ఎలా మంజూరుచేశారంటూ ప్రశ్నించారు.

### రూరల్ ఎమ్మెల్యే స్వగ్రామంలో గందరగోళం

- అధికారులపై ఉపాధి కూలీల ఆగ్రహం

రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి సొంతగ్రామ జలాల్‌పూర్‌లో ఏర్పాటు చేసిన గ్రామసభలో అధికారులను ప్రజలు నిలదీశారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద భూమి ఉన్న వారికే మంజూరైన పేర్లు చదివారంటూ అధికారులపై ఉపాధిహామీ కూలీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. భూమి లేని తాము ఉపాధి పనులు చేసినా కూడా తమకెందుకు మంజూరు చేయలేదని మండిపడ్డారు. అర్హులైన కూలీలందరూ ఒక్కసారిగా లేచి అధికారులపై ప్రశ్నల వర్షం కురిపించడంతో సభలో కొద్దిసేపు గందరగోళం పరిస్థితి ఏర్పడింది. ఎవరు ఏం మాట్లాడుతున్నారో అర్థం కానీ పరిస్థితి నెలకొన్నది.



వేల్పూర్ మండలం జాన్కంపేట్ గ్రామ సభలో అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు



ముప్కాల్ గ్రామసభలో ఓ యువకుడిని సముదాయిస్తున్న పోలీసు

### సమాధానాలు చెప్పలేక.. అర్ధాంతరంగా ముగించిన గ్రామసభలు

ముప్కాల్ గ్రామసభలో పథకాల జాబితాల్లో అర్హుల పేర్లు లేకపోవడంతో అధికారులను గ్రామస్తులు నిలదీశారు. అర్హులైన వారికి పథకాలు అందిస్తామని చెప్పి, ఆఖరికి నిరాశకు గురిచేశారంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. జాబితాపై గ్రామస్తులు అడిగిన ప్రశ్నలకు అధికారులు సమాధానం చెప్పలేక గ్రామసభ అర్ధాంతరంగా ముగించి జారుకున్నారు. వేల్పూర్ మండలంలోని జాన్కంపేట్ గ్రామసభలో రసాభాస చోటుచేసుకున్నది. సంక్షేమ పథకాలను అనర్హులకు కేటాయించడంపై గ్రామస్తులు ఎంపీడీవో బాలకిషన్‌ను నిలదీశారు. అధికారులు రూపొందించిన జాబితాను వెంటనే రద్దుచేసి, మళ్లీ సర్వే చేపట్టి అర్హులను ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు. దీంతో అధికారులు అర్ధాంతరంగా సభను ముగించుకొని వెళ్లిపోయారు.



బోధన్ మండలం అమ్దాపూర్ గ్రామసభలో అధికారులను ప్రశ్నిస్తున్న ప్రజలు



బాల్కొండ మండల కేంద్రంలో నిర్వహించిన గ్రామసభలో అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు

### సమాచారం లేకుండా ఎందుకు వచ్చారు?

- బోధన్ పట్టణంలోని 24వ వార్డులో ఏర్పాటు చేసిన గ్రామ సభలో అర్హుల జాబితాలో అందరి పేర్లు లేవని ప్రశ్నించిన ఓ వ్యక్తికి సదరు వార్డుసభ అధికారి శ్రీనివాస్ నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారు. తమదగ్గర ఉన్న సమాచారం మాత్రమే తమకు తెలుసని, మిగతా వివరాలకు కమిషనర్‌ను అడగాలని చెప్పడంతో సమాచారం లేకుండా ఎందుకు వచ్చావంటూ సదరు అధికారిని స్థానికులు నిలదీశారు.
- బాల్కొండలో నిర్వహించిన గ్రామసభలో గందరగోళం ఏర్పడింది. రేషన్‌కార్డు, ఇందిరమ్మ ఇండ్లు పేదలకు కాకుండా కాంగ్రెస్ పార్టీ నాయకులకు అనుకూలంగా ఉన్నవారికి ఇచ్చారంటూ అధికారులను గ్రామస్తులు నిలదీశారు. ఎక్కువగా విదేశాల్లో ఉన్నవారికి, ప్రభుత్వ ఉద్యోగ కుటుంబాలకు, ఎక్కువ భూమి ఉన్న వారికి వచ్చాయంటూ ఆందోళన చేశారు.
- రుద్రూర్ మండల కేంద్రంతోపాటు రాణంపల్లి, రాయకూర్ క్యాంపు, అక్బర్‌నగర్ గ్రామసభల్లో ఇందిరమ్మ ఇండ్ల జాబితాపై గ్రామస్తులు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తంచేశారు. ఇల్లుకు దరఖాస్తు చేసుకోకుండానే ప్లాట్ లేదని, ఇల్లు కట్టుకుంటామని దరఖాస్తు చేసినట్లు జాబితాలో రావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనర్హుల పేర్లతో కూడిన జాబితాతో గ్రామ సభకు హాజరయ్యారని అధికారులపై మండిపడ్డారు.
- ఏర్గట్ల మండలంలోని తొర్తి గ్రామంలో నిర్వహించిన గ్రామ సభ రచ్చరచ్చగా మారింది. అర్హుల జాబితాల్లో అర్హుల పేర్లు లేవంటూ అధికారులను నిలదీశారు. అర్హులను ఎంపిక చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.
- మోర్తాడ్ మండలంలోని దోన్‌పాల్, శెట్‌పల్లి గ్రామాల్లో జరిగిన గ్రామసభల్లో ప్రజలు ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డుల విషయంలో అధికారులను నిలదీశారు.
- బోధన్ మండలంలోని అమ్దాపూర్, భవానిపేట్, బండర్‌పల్లి, పెంటాకలాన్, సిద్దపూర్ గ్రామాల్లో గ్రామసభలు గరంగరంగా కొనసాగాయి. ఇంటింటి సర్వేలో రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకుంటే జాబితాలో తమ పేర్లు రాలేదని అధికారులను నిలదీశారు.
- భీమ్‌గల్ మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో అధికారులను గ్రామస్తులు నిలదీశారు. దాబా ఇండ్లు ఉన్నవారికి మరోసారి ఇండ్లు మంజూరుచేశారంటూ మండిపడ్డారు. బడా భీమ్‌గల్‌లో బుధవారం గ్రామసభ ముగిసిన తరువాత గురువారం మరోసారి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అంటూ సర్వేలు నిర్వహించడం విడ్డూరం.



## స్కూల్ బస్సు బోల్తా

ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

- ఇద్దరు విద్యార్థులకు స్వల్పగాయాలు
- క్లీనర్ డ్రైవింగ్ చేయడంతోనే ప్రమాదం

నవీపేట, జనవరి 23: మండలంలోని కమలాపూర్ శివారులో గురువారం ఓ ప్రైవేటు స్కూల్ బస్సు బోల్తాపడిన ఘటనలో ఇద్దరు విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. నార్త్ రూరల్ సీఐ శ్రీనివాస్, ఏఎస్సై మోహన్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. నవీపేటలోని ఓ ప్రైవేట్ స్కూల్ బస్సు నారాయణపూర్ గ్రామానికి చెందిన 30 మంది విద్యార్థులను గురువారం ఉదయం ఎక్కించుకొని స్కూల్‌కు వెళ్తున్నది. క్లీనర్ భోజన్న బస్సును నడిపాడు. కమలాపూర్ శివారులోని అంకాలమ్మ, పోలేరమ్మ ఆలయం వద్ద బైక్‌ను తప్పించే క్రమంలో బస్సు అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో విద్యార్థులు మీనాక్షి, నయాన్షికి స్వల్ప గాయాలయ్యాయి. మిగతా 28 మంది విద్యార్థులు సురక్షితంగా బయటపడడంతో వారి తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రమాదానికి గల కారణాలను నిజామాబాద్ ట్రాఫిక్ ఏసీపీ నారాయణ, నార్త్ రూరల్ సీఐ శ్రీనివాస్, ఎంవీఐ కిరణ్‌కుమార్, ఆర్టీవో ఉమమహేశ్వర్‌రావు వివరాలను సేకరించారు.

## మంచు దుప్పటి

కామారెడ్డి పట్టణాన్ని గురువారం ఉదయం పొగమంచు కప్పేసింది. ఉదయం 8 గంటల వరకు పొగమంచు ఏర్పడడంతో వాహనదారులు రోడ్లు కనబడక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వాహనాలకు లైట్లు వేసుకొని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. భిక్కనూర్ మండలంలోని జంగంపల్లి గ్రామాన్ని కూడా పొగమంచు కప్పేసింది.

– కామారెడ్డి/భిక్కనూర్, జనవరి 23





## ఫైనాన్స్ వేధింపులకు యువకుడు బలి

### తుజాల్‌పూర్‌లో విషాదం

బీబీపేట్, జనవరి 23: ఫైనాన్స్ కంపెనీ వేధింపులకు ఓ యువకుడు బలయ్యాడు. చెట్టుకు ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడిన ఘటన మండలంలోని తుజాల్‌పూర్ గ్రామంలో చోటుచేసుకున్నది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. తుజాల్‌పూర్ గ్రామానికి చెందిన సుంకరి ప్రవీణ్‌గౌడ్(32) ఇంటి నిర్మాణం కోసం ఓ ఫైనాన్స్ కంపెనీలో రూ. 3 లక్షల రుణం తీసుకున్నాడు. మొదటి నుంచి ఈఎంఐలు సక్రమంగా చెల్లిస్తూ రాగా..చివరి ఈఎంఐ చెల్లించడంలో జాప్యం నెలకొన్నది. దీంతో ఫైనాన్స్ యాజమాన్యం, సిబ్బంది ప్రవీణ్‌గౌడ్‌ను బయట, ఇంటికి వెళ్లి వేధించసాగారు. దీంతో తీవ్ర మనోవేదనకు గురైన ప్రవీణ్‌గౌడ్ గ్రామ శివారులోని ఓ చెట్టుకు బుధవారం రాత్రి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య అర్చన, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ పెద్ద ఆత్మహత్య చేసుకోవడంతో కుటుంబం వీధిన పడింది. ప్రవీణ్‌గౌడ్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడి భార్య సుంకరి అర్చన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రభాకర్ తెలిపారు.